క్లుప్తంగా

సర్పంచ్ చెక్ పవర్ నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామ సర్పంచ్ పి. సుబ్బారావు చెక్‌పవర్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు డీపీఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దొడ్డవరం గ్రామానికి సంబంధించి పబ్లిక్ వాటర్ స్కీమ్ పేరుతో పలు అవకతవకలు జరిగినట్లు వివిధ దిన పత్రికల్లో వార్త ప్రచురితమైంది. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దొడ్డవరం పంచాయతీ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ రఘుబాబు విచారణ నిర్వహించారు. నివేదికను డీపీఓ కార్యాలయానికి సమర్పించగా గురువారం సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా నిలిపి వేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సర్పంచ్‌కు సంజాయిషీ ఇవ్వాల్సిందిగా నోటీసు జారీ అయ్యాయి. ఇకపై దొడ్డవరం పంచాయతీ పరిధిలో ఎటువంటి నిధులు డ్రా చేయాలన్నా ఈఓపీఆర్‌డీ కౌంటర్ సంతకం చేయాలని ఆ చెక్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఒంగోలు ట్రెజరీ కార్యాలయానికి వెల్లడించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రశాంతికి డాక్టరేట్


హైదరాబాద్‌లో రమేష్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న ప్రశాంతి

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామ వాసి.. జై భీమ్ క్యాన్సర్ ఇమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ ప్రశాంతికి డాక్టరేట్ లభించింది. నిరు పేద కుటుంబంలో పుట్టిన ప్రశాంతి పేదలకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు, అనేక సేవలు అందిస్తున్నారు. నిత్యం ప్రజలతోనే ఉంటూ ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కలిగిస్తున్నారు. ఇలా ఆమె చేసిన సేవలు గురించి అనేక సంస్థలు అవార్డులు అదించాయి. అందులో భాగంగా ఈ నెల 17న తెలంగాణ రాష్ట్రంలో సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో.. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. అక్కడ ఆసియా ఇంటర్నేషనల్ రీసెర్చ్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ ఆమె సేవలను గుర్తించి డాక్టరేట్ ఆందజేశారు. రమేష్ మాట్లాడుతూ అనేక సామాజిక రంగాల్లో సేవతో పాటు క్యాన్సర్‌పై మహిళలను చైతన్య పరుస్తున్న ప్రశాంతిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని, సమాజంతో, సమస్యలతో యుద్ధం చేస్తున్న మహిళా లోకం పటుత్వంతో ఉండాలని సూచించారు. క్యాన్సర్ పేషెంట్లకు పింఛన్‌తో పాటు సొంత గృహాలు కూడా కట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దళితుల సమస్యలు పరిష్కరించండి


ఎస్పీ దామోదర్‌ను అభినందిస్తున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య

ఒంగోలు టౌన్: జిల్లాలో దళితులపై దారుణాలు జరుగుతున్నాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు తెలియజేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పలువురు దళిత నాయకులతో కలిసి ఎస్పీగా బాధ్యతలను చేపట్టిన ఏఆర్ దామోదర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల వెంకటరావు, బత్తుల సుబ్బయ్య, ఆనంద్, వెంకీ, అజయ్, యోహాన్ ఉన్నారు.

25 వరకు డిగ్రీలో అడ్మిషన్‌లకు గడువు

కంభం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20024-25 విద్యా సంవత్సరానికి ఈ నెల 25వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్ పాసైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

మురుగు నీరు వెళ్లేలా చూడాలి

పెద్దదోర్నాల: కాలువల్లోని మురుగు నీరు సక్రమంగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సాయిమిత్ర అపార్ట్‌మెంట్ వెనుక వీధి వాసులు పంచాయితీ అధికారులను మొరపెట్టుకుంటున్నారు. ఈ వీధి వాసులు ఎవరికి వారు తమ ఇళ్ల ముందు కాలువలను పూడ్చుకుని మురుగు నీరు వెళ్లకుండా చేస్తున్నారని, దీని వల్ల ఇళ్లల్లోకి మురుగునీరు వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ పంట సాగు హక్కు పత్రాలు


రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏఓ మోహన్ రెడ్డి

కొత్తపట్నం: వ్యవసాయం సాగుబడి చేసే కౌలు రైతులకు పంట సాగు హక్కుదారు పత్రాలు (సీసీఆర్‌సీ కార్డులు) ఇస్తామని ఏఓ మోహన్‌రెడ్డి అన్నారు. రాజుపాలెం గ్రామం రైతు సేవా కార్యాలయంలో గురువారం కౌలు రైతులకు పంట సాగు హక్కుదారు పత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అయన మాట్లాడుతూ భూ యజమానులు దీనికి సహకరించాలని.. సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయడం ద్వారా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కౌలు రైతులకు భూమిపై ఎలాంటి హక్కులు లభించవని.. కేవలం పండించే పంటపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఆ పంటల వరకు మాత్రమే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు.. ఇతర పథకాలు వర్తిస్తాయన్నారు. దీనికి భూ యజమానులు సహరించాలని కోరారు. గ్రామ స్థాయిలో వీఆర్వోలు, వీఏఏలు ముందుగా నిజమైన కౌలు రైతులను గుర్తించి వారికి సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. వారి పేర్ల జాబితాను ఆయా బ్యాంక్‌లకు పంపించాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చిన వారికి పంట లోన్లను కూడా ఇప్పించాల్సి బాధ్యత వీఆర్వోలు, వీఏఏలు తీసుకోవాలని ఆదేశించారు. కౌలు కార్డు ఉపయోగించి పంటల బీమా పంట నష్టం, అన్నదాత, సుఖీభవ, రాయితీలపై విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం ఇచ్చే రాయితీలన్నీ పొందవచ్చని ఏఓ వివరించారు.

నేత్ర శస్త్ర చికిత్సలు విజయవంతం


పండ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటి బ్యాచ్‌కు కంటి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 13న సినీ హీరో బూచేపల్లి కమలాకర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పెదకాకానికి చెందిన శంకర నేత్రాలయం సహకారంతో కంటి ఆపరేషన్‌లకు మొత్తం 800 మంది ఎంపిక కాగా మొదటి బ్యాచ్‌లో 60 మందికి కంటి ఆపరేషన్ చేయించారు. వారిని గురువారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు.

పేషెంట్లకు బూచేపల్లి వెంకాయమ్మ పండ్లు పంపిణీ చేశారు. రెండో బృందాన్ని ఎంపిక చేసి శస్త్ర చికిత్సలకు పంపనున్నట్లు చెప్పారు.

బిల్లులు చెల్లించి.. మీటింగులు జరుపుకోండి!

- ప్రజావేదికలో డ్వామా పీడీకి టీడీపీ నాయకుల అల్టిమేటం
- ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని పట్టు
- మేము చెప్పిన పేర్లకు ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్


కూటమి నాయకులతో మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

కురిచేడు:

'మా బిల్లులు చెల్లించకుండా.. మా ప్రభుత్వంలో మీరు పనికి ఆహార పథకం మీటింగులు ఎలా పెడతారు, ఆపేయండి..' అంటూ కూటమి నాయకులు మూకుమ్మడిగా ప్రజావేదికలో డ్వామా పీడీ అర్జునరావును హెచ్చరించారు. తమకు నీరు–చెట్టు పనుల తాలూకా బిల్లులు ఇంకా ప్రభుత్వం చెల్లించలేదని, క్వాలిటీ కంట్రోలు అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వకుండా 5 సంవత్సరాల నుంచి ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవి చెల్లించిన తర్వాతనే మీటింగులు జరుపుకోవాలని తేల్చి చెప్పారు. ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిని బయటకు తీసి తమకు శ్వేతపత్రం అందజేయాలని ఆర్డరు వేశారు. అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో పీడీ స్పందిస్తూ ప్రజావేదికలో థర్డ్ పార్టీ తనిఖీ రిపోర్టులు మాత్రమే చూడగలమని, క్వాలిటీ కంట్రోలు అధికారుల రికార్డులు కార్యాలయంలో ఉంటాయని, ఒంగోలు కార్యాలయానికి వస్తే చూసి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కూటమి నాయకులు కలుగజేసుకుని ఇప్పుడు ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో తాము పంపిన జాబితాలోని వారికి ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఆర్డర్లు ఇవ్వాలని పీడీ అర్జునరావును కోరారు. అందుకు ఆయన సమ్మతించటంతో అందరూ వెనుదిరిగి వెళ్లారు.

కౌలుకార్డుతో రైతులకు మేలు


అవగాహన కల్పిస్తున్న నాగమణి, అధికారులు

కురిచేడు: కౌలుకార్డుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో తహసీల్దార్ ఏవీ సుధాకర్‌తో కలిసి కౌలుకార్డుల అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ప్రభుత్వ పథకాలు తీసుకోవాలంటే కౌలుకార్డు తప్పనిసరన్నారు. భూమి లేకుండా పంటలు పండించే రైతులకు సాగు హక్కుపత్రం ఇస్తున్నట్లు ఏవీ సుధాకర్ తెలిపారు. ప్రతి గ్రామంలో కౌలు కార్డుతో కలిగే ప్రయోజనాలను గ్రామసభల ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. భూమి యజమాని అంగీకారంతో కార్డులు మంజూరు చేస్తామని, ఆ కార్డు ద్వారా పంటరుణాలు, పంటనష్టంతో పాటు ప్రభుత్వం అందించే ప్రతి పథకం వర్తిస్తుందన్నారు. ఆర్‌ఐ ఆర్.నాగరాజు, వీఆర్వో వి.సరోజిని, వీఏఏలు నవీన్, వెంకటేష్ పాల్గొన్నారు.

కౌలురైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలి

దొనకొండ: సొంత పొలం లేని రైతులు, తక్కువ పొలం ఉండి గ్రామాల్లోని ఇతర పెద్ద రైతుల వద్ద పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేయబోయే రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం మండలంలోని గంగదేవిపల్లి, పెదన్నపాలెం సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీసీఆర్‌సీ కార్డులు కోసం యజమాని ఆధార్, పొలం 1బీ తీసుకుని సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని కోరారు. ఈ ఏడాది ఒక్కో రైతు సేవా కేంద్రంలో 73 కార్డులు ఇవ్వాలనే లక్ష్యాన్ని అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. యజమాని హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వ కౌలుదారు అమలు చట్టం 2019లో చేశారని, కౌలు రైతులకు ఆ పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని తెలిపారు. పొలం మీద ఎలాంటి హక్కు ఉండదని, అమ్ముకోవటానికి ఎలాంటి వీలు ఉండదన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు ఉపయోగ పడుతుందన్నారు. బ్యాంకుల ద్వారా రుణం పొందవచ్చని తెలిపారు. కౌలు రైతు దరఖాస్తు చేసుకున్న 3 రోజుల్లో కార్డు మంజూరు చేయనున్నట్లు వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. సర్పంచ్‌లు ఎగ్గోని కుమారి, మిండాల మంగమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు సహకరించాలి

కురిచేడు: భూయజమానులు కౌలు రైతులకు పంట సాగు ధృవీకరణ పత్రాలు వచ్చేలా సహకరించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ గుంటూరు నాగమణి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఎస్సీ, ఎస్టీ కౌలు రైతుల పంటసాగు దారుల చట్టం ప్రచార ఉద్యమం వాహన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డీబీఆర్‌సీ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూ యజమానుల నుంచి సాగు చేస్తున్న కౌలు భూముల సాగుపై మాత్రమే కౌలు రైతుకు హక్కు ఉంటుందన్నారు. భూమిపై ఎలాంటి హక్కు ఉండదన్నారు. ఈ విషయాన్ని భూ యజమానులు గుర్తించి కౌలురైతులకు సహకరించాలన్నారు. వీఆర్వో, వీఏఏల సహకారంతో పంటల సాగు ధృవీకరణ పత్రాలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా నగదు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంకు రుణాలు పొందటానికి కౌలు రైతులకు ఎక్కువ అవకాశం ఉన్నందున ప్రతి కౌలు రైతు పంటసాగు ధ్రువీకరణ పత్రం పొందాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు భూ యజమానులు సహకరించి వారి వ్యవసాయ అభివృద్ధికి సహకరించాలని అలవలపాడు వీఆర్వో కాశయ్య కోరారు. ఆర్‌ఐ నాగరాజు జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. పొట్లపాడు వీఆర్వో వి.హనుమంతరావు, కురిచేడు వీఆర్వో వి.సరోజిని పాల్గొన్నారు.

బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభం


కంది పప్పు, బియ్యం పంపిణీ చేస్తున్న ఆర్‌డీఓ


కందిపప్పు అందజేస్తున్న ఎంపీపీ తులశమ్మ

కంభం: స్థానిక స్టార్ సినిమా హాలు ఎదురుగా ఉన్న రైస్ మిల్‌లో మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రామయ్య తెలిపారు. గురువారం ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. కందిపప్పు కేజి రూ.160, బియ్యం స్టీమ్డ్ బీపీటీ/సోనామసూరి కేజి రూ.49, పచ్చి బీపీటీ/సోనామసూరి రకం కేజీ రూ.48 ప్రభుత్వం నిర్దేశించిందని, ఈ ధరల ప్రకారమే అమ్మడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, గోడౌన్ డీటీ ప్రసాద్, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి బ్రహ్మయ్య, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు స్టార్‌బాషా, కోటయ్య, కేతం శ్రీను, తోట శ్రీను పాల్గొన్నారు.

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు పంపిణీ

దొనకొండ: నిత్యావసర ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం రాయితీపై బియ్యం, కంది పప్పు సరఫరా చేస్తోందని కనిగిరి ఆర్‌డీఓ జాన్ నిర్విన్ తెలిపారు. స్థానిక స్త్రీ నిధి కార్యాలయంలో గురువారం సబ్సిడీపై అందించే కందిపప్పు, బియ్యాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కంది పప్పు కేజీ రూ.160, బియ్యం ఒక రకం రూ.49, మరొక రకం రూ.48 విక్రయించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కె.సుజాత, డీటీ రామనారాయణరెడ్డి, జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

- న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయాధికారులు


ర్యాలీకి హాజరైన న్యాయవాదులు, అధికారులు

దర్శి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంతో తమ ప్రాణాలు కాపాడుకోవచ్చని న్యాయవాదులు బి.చెన్నకేశవులు, పి.సురేష్ పేర్కొన్నారు. స్థానిక గడియారం స్తంభం వద్ద దర్శి కోర్టు న్యాయవాదులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి హెల్మెట్ ప్రాధాన్యంపై ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సూచన మేరకు ద్విచక్ర వాహనాలు నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు రక్షణ పొందేందుకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించిన నేపథ్యంలో స్థానిక కోర్టు న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి ద్విచక్ర వాహనం అవసరం ఉందన్నారు. వాహనాలు ఎక్కువై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ఒకటి రెండు సార్లు చెప్పినా హెల్మెట్ ధరించకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. న్యాయవాది పి. మనోహరమ్మ, బి.నవీన్‌కుమార్, పారా లీగల్ వలంటీర్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు


కౌన్సిల్ సమావేశాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

ఒంగోలు టౌన్: రైతులు సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అఖిల భారత కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు విమర్శించారు. ఈనెల కర్నూలులో నిర్వహిస్తున్న ఏఐకెఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాల గోడపత్రికను గురువారం మాదాల స్వామి భవనంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా రైతుల సమస్యలు తీరక ఆత్మహత్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఎంతో మంది పాలకులు వచ్చిపోయినా రైతుల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడానికి పాలకులు ఎందుకు వెనకంజ వేస్తున్నారో, ఎవరి కోసం నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాల్సిన అవసరం ఉందని నిలదీశారు. ఏడాదికి 12000 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే పాలకులు మాత్రం అంబానీ, అదానీల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారని, ఇప్పటికైనా రైతు, కూలీల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకుంటామన్నారు. అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్, రైతు కూలీ సంఘం నాయకులు రాంగారావు, చక్రవర్తి, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని పబ్లిక్ టాయిలెట్స్

కంభం:



ప్రారంభించకుండా వదిలేసిన పబ్లిక్ టాయిలెట్స్

నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలిలో హైవేకు ఆనుకొని సచివాలయం పక్కన నిర్మించి ప్రారంభించకుండా వదిలేసిన పబ్లిక్ టాయిలెట్స్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకొస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కందులాపురం కూడలి పరిసరాల్లో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నుంచి బస్సుల్లో వచ్చే ప్రయాణికులు తెల్లవారు జామున ఈ ప్రాంతంలోనే బస్సులు దిగితుంటారు. రైళ్లలో దూరప్రాంతాల నుండిచి ప్రయాణాలు చేసి వచ్చిన ప్రయాణికులు ఆటోలో కందులాపురం కూడలికి చేరుకొని వారి ఊర్లకు బస్సుల్లో వెళ్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు, ప్రయాణికులు, విద్యార్థినీ, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కందులాపురం పంచాయతీ ఆధ్వర్యంలో కందులాపురం-2 సచివాలయం పక్కనే పబ్లిక్ టాయిలెట్స్ ఎన్నికలకు ముందే నిర్మించారు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అప్పుడు ప్రారంభానికి నోచుకోలేదు. ఎన్నికల కోడ్ ముగిసి రెండు నెలలు కావస్తున్నా నేటికీ పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చౌకధరల దుకాణాన్ని వినియోగించుకోవాలి

కొమరోలు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ మల్లికార్జుననాయుడు సూచించారు. పట్టణంలోని చిన్నపీర్ల చావిడి వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాన్ని ఎంపీడీఓ నరసింహారావుతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్న నిత్యావసరాలను ప్రభుత్వ రాయితీపై తక్కువ ధరలకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో మంచిరకం బియ్యం 55 రూపాయలు ఉండగా 49 రూపాయలకే అందిస్తున్నామని, కందిపప్పు 181 రూపాయలు ఉండగా 160 రూపాయలకే అందిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సామూహిక కోటి కుంకుమార్చన

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లో శ్రీలక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సామూహిక కోటి కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్ భట్టర్, మురళీకృష్ణమాచార్యులు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉభయ దాతలను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. ఆలయ నిర్మాణ, నిర్వహణ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, రవిశంకర్, పెరుమాళ్ల భాస్కర్, మల్లయ్య, పునుగుపాటి కోటేశ్వరరావు, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.